# ఒంటరి దుఃఖం

వరమ్మ మల్లా పుట్టింటికొచ్చింది.

చంటిపిల్లాడు అమ్మ కుడిచేతివేళ్ళని వంకర్లు తిప్పుతూ 'పప్పుండ' 'పప్పుండ' అని నస పెడుతున్నాడు. చంకల్లో చంటిపిల్ల తన బొటనవేలిని చీకుతూ తల్లి కళ్ళల్లోకి చూస్తోంది.

నిదానంగా వాకిలి దాటి అడుగులు వేసింది. ఆవరణంతా బావురుమంటున్నట్టుంది. మొక్కలన్నీ ఎండిపోయినట్టున్నై. ఆ మూల రాపుసింది మోడుగా నిలిచివుంది. ఈ మూల నారింజా అట్లాగే ఉంది. ఎటు చూసినా చెత్తా చెదారం కనిపిస్తోంది. ప్రహరీ గోడలు అక్కడక్కడా మొండివైపోయాయి. బీటలవారినై. పగుళ్లని చీల్చుకుని రావి మొక్కలు లేస్తున్నై.

భారంగా రేకుల వసారాకేసి నడిచింది వరమ్మ.

ఎవ్వరూ ఎదురు రాలేదు. మామూలుగా అయితే తల్లి సుభద్రమ్మో, వదిన పారవతో నవ్వు మొహంతో ఎదురొచ్చి లోపలికి ఆహ్వానించేవారు. మేనకోడళ్ళిద్దరూ కూడా ఇంట్లో లేనట్టున్నారు. ఇంటి వాతావరణమే ఏమిటో గాలితీసిన బుడగమాదిరి అనిపిస్తోంది.

వరమ్మ దిగులు మోస్తూన్న గుండెతో అడుగులు వేస్తూ వసారా దాకా వచ్చింది. బయట గాబులో నీళ్ళున్నై. పక్కన సగం విరిగిన ప్లాస్టిక్ మగ్గు తీసుకుని కాళ్లు కడుక్కుంది. పిల్లాడి కాళ్లమీదా కాసిన్ని నీళ్ళు పోసింది. అడుగు కదిల్చింది. వసారా మెట్లెక్కుతుంటే 'అంతా బావున్నారుటే.... రా' అంటూ ఎదురొచ్చింది సుభద్రమ్మ. కూతురి చంకలోని పిల్లని రెండు చేతుల్లోకి తీసుకుని లోపలికి కదిలింది.

"ఊఁ" అంటూ సన్నగా అన్నది వరమ్మ.

హాల్లో గోడవారగా కూచున్నారు. దొడ్లో నుంచీ వచ్చింది పార్వతి. వరమ్మ తన వదిన మొహంలోకి చూసింది. ఆమె వంటింట్లోకి నడుస్తూ 'బాగున్నార్టమ్మా' అని పలకరించింది. 'ఆ' అన్నది వరమ్మ.

కుమ్మపొగని కొంగున కట్టుక్కూర్చున్నట్టుంది వరమ్మకి. ఏం మాట్లాడాలో అర్థం కావడంలేదామెకు. మనసు ఆలోచనల సుడిగుండంలో చిక్కుకుని వుంది. తన పరిస్థితి తనకే విచారకరంగా వుంది వరమ్మకి. వెనక నుయ్యీ, ముందు గొయ్యీ! మధ్యలో కుక్కలు తరుముతున్న కుందేలు పిల్ల పరిస్థితిగా తన స్థితి వుంది.

పిల్లవాడికి పప్పుండనీ, ఆడబదుచుకి కాఫీని తెచ్చిచ్చింది పార్వతి. రెండు నిమిషాలలు నిలబడి మళ్లీ తన పనికి తాను లోపలికి వెళ్ళిపోయిందామె.

కాఫీ తాగుతున్న కూతుర్నిచూస్తూ కూచుంది సుభద్రమ్మ.

'ఈ పిల్ల మరీ నవసి పోస్తున్నది. దూసిన గోరింటకాడలా కనిపిస్తోంది. ఆ అత్తమ్మ ఆరడీ, మొగుడి రాపిడీ దీని ఉసురు దీస్తున్నె' అనిపించింది. గుండె బిగించినట్లయింది. కన్ను చెమర్చింది.

మనసు పరిపరివిధాలా పోసాగింది. వరమ్మ మనసులో శతకోటి కల్లోల్ల సరస్సులు.

గాలి స్తంభించినట్లుంది. హాలు మౌనంలో కూరుకుపోయింది.

❖ ❖ ❖

వరమ్మ వచ్చి రెండురోజులైంది.

సగం అసందర్భపు నిజాలూ, సగం అబద్ధాలూ చెప్పుకుంటూ గడిపింది రెండు రోజులూ, మనస్ఫూర్తిగా నరారా ఏవీ చెప్పుకోలేకపోయింది. అత్తమ్మ సంగతీ, మొగుడు సంగతీ బాగానే తెలుసు తన పుట్టింటివాళ్ళకి. కానీ, ప్రస్తుతం జరుగుతున్న భాగోతం తెలీదు. తానుగా చెప్పలేని విషయం...! మాట్లాడిందంతా తుంపులూ, ముక్కలూ బాపతు! అవి వింటూ, సర్లే.. సర్లే...' అని తప్పుకుపోతున్నాడు స్వామి అన్న. వదిన కూడా ముభావంగానే వుంటోంది. తల్లిమాత్రం కూతురి కష్టాల్ని తలచుకుని, పైకి చెప్పుకుంటూనూ, ముక్కు చీదుకోనూ కళ్లొత్తుకోనూ చేస్తోంది.

ఆమె సొదని వింటూ అడపాదడపా పొడిపొడి మాటలు కలుపుతున్నారు అన్నా వదినా. పిల్లలు ఇద్దరూ మేకోడళ్లతో కలిసిపోయి ఆడుకుంటున్నారు. వేళకింత తిండి మాత్రం కంచంలోకి వడ్డిస్తోంది పార్వతి.

ఇవాళ ఉదయం స్వామి టిఫిన్ చేస్తూంటే ఆ ప్రసక్తి తెచ్చింది వరమ్మ. "ఆయన గట్టిగా చెప్పమన్నారన్నయ్యా" అని మాట మొదలెట్టగానే "తెలిసిన సంగతే కదే" అని సంభాషణని తుంచేశాడు స్వామి.

ఆ వెంటనే బయటికి వెళ్లిపోయాడు. "ప్రత్యేకంగా చెప్పేదేం వుందిలే వరం!. గట్టిగా చెప్పినా, బోలుగా చెప్పినా-డబ్బు మాత్రం బరువుగానేగా ఉండేది" అన్నది పార్వతి.

"అయినా పేలపిండినీ, ఊకనీ ఎన్నిసార్లు దంచుకున్నా ఒకటే.."అని మొహం తిప్పుకుంది.

సుభద్రమ్మ నొచ్చుకుంది. కొడుకూ కోడలి కష్టాలు తెలిసిన మనిషే కావడంతో ఏంపీ ఆపలేకపోయింది. కూతురి పరిస్థితి మాత్రం ఆమెని కుంగదీస్తూనే వుంది. వరమ్మ అత్త ఓ గయ్యాళి. డబ్బు మనిషి ఒక్కడే కొడుకు సింగన్న. కోడలు ఇద్దరు బిడ్డలతల్లే అయినా, అత్త దాష్టీకంలో మార్పు రాలేదు. సూటీపోటీ మాటలు. ఆ పైన కొడుక్కి పురెక్కించి తిట్టించడం, కొట్టించడం, పుట్టింటికి తరమటం. ఇదీ వరస.

వరమ్మ అత్తారివూరు ఇసుకపల్లి. పుట్టింటికి పాతిక కిలోమీటర్ల దూరం.

దిగాలుగా గోడవారన కూచునుంది వరమ్మ. ఆమెనలా చూస్తుంటే, సుభద్రమ్మ తలపులు గతాన్ని కెలికాయి.

❖ ❖ ❖

ఇరవై ఏళ్ల క్రితం కులాలకుళ్లు రాజకీయాల్తో హత్యకు గురయ్యాడు సుభద్రమ్మ భర్త. స్వామి, చలపతి, చంద్రం-ముగ్గురు కొడుకుల్నీ, కూతురు వరమ్మనీ సాకుతూ బతుకుతో పెద్ద పోరే చేసిందామె. కుటుంబపోషణకీ, హైస్కూలు చదువుల వరకూ ఖర్చుకీ వున్న నాలుగెకరాల్లో రెండెకరాలు పోయాయి. ఎకరం పొలం చంద్రం వ్యాపారమంటూ చేసి అప్పుల కింద పోగెట్టాడు. అరవై సెంట్లు కట్నమిచ్చి వరమ్మ పెళ్లి చేసింది. మిగిలిన నలభై సెంట్లూ అమ్మితేగానీ పెళ్లి ఖర్చూ, పిల్లకి లాంఛనాలూ, కాపరానికి పంపటం పూర్తికాలేదు. సున్నకు సున్న హళ్లికి హళ్లి సామెతయ్యింది.

స్వామి కాఫీ పొడి షాపు పెట్టుకుని సంసారాన్ని లాగిస్తున్నాడు. చలపతి గుంటూర్లో డ్రైవర్‌గా వున్నాడు. చంద్రం ఏలూరులో మెకానిక్‌గా వుంటున్నాడు.

స్వామి పెళ్లి, కుటుంబం ఖర్చులూ, చంద్రం అడపాదడపా తీసుకుపోయే డబ్బు వీటన్నిటివలనా ఉన్న స్థలంలో వెయ్యి గజాల స్థలమూ ఎవరికో అమ్మేశారు. మిగిలింది ఐదు వందల గజాల స్థలం. ఏడాది క్రితం సింగన్న పుర్రెలోకి ఎట్టా వచ్చిందో వచ్చిందా ఆ ఆలోచన. వాళ్లమ్మే కారణమంటుంది వరమ్మ.

చంద్రమౌళి పోయేనాటికి నాలుగెకరాల పొలం వుంది. పదిహేను వందల గజాల స్థలం దాన్లో, చిన్న ఇల్లూ వున్నై. ఈ మొత్తం ఆస్తిలో ఐదోవంతు వాటా వరమ్మకి రావాలి. ఇదీ సింగన్న డిమాండ్. కనుక ఎనభై సెంట్ల పొలం, మూడొందల గజాల స్థలం పొందడం ఆమె హక్కు ఇందులో అరవై సెంట్లే ఇచ్చారు కాబట్టి మిగిలిన ఇరవై సెంట్ల కింద నాలుగులక్షల రూపాయలూ, మూడొందల గజాల స్థలం ఇవ్వమనే పేచీ అతనిది. పెయింటరని పేరేగానీ, తాగుడూ, జులాయి తిరుగుళ్ళూ...

ఈ ఏడాది నుంచీ తానుగా ఇంటిమీదికొచ్చి యాగీ చేయడం, వరమ్మని తరిమి డబ్బు తెమ్మని హింసించడం.

ఇక్కడ చూడబోతే ఆమె అన్నలుముగ్గురూ – పూచికపుల్ల కూడా ఇచ్చేదిలేదని చెప్పకనే చెబుతున్నారు.

ఇవీ బాధాకరమైన సుభద్రమ్మ జ్ఞాపకాలు. అశక్తత, నిస్సహాయత. ఆ రాత్రి వరమ్మ పిల్లవాడికి జ్వరం తగిలింది.

స్వామి షాపు మూసి ఇంటికి చేరేసరకి రాత్రి పదిగంటలైంది. అన్నం పెడుతూ విషయం చెప్పింది పార్వతి.

దక్షిణం గదిలో పడుకుని వున్నారు సుభద్రమ్మ. వరమ్మ, ఆమె పిల్లలూ, స్వామి పిల్లలు హాల్లో పడుకున్నారు.

భోజనం అయిన తర్వాత చెల్లెలు దగ్గరికెళ్ళాడు స్వామి. పార్వతి వంటిల్లు సర్దుకుంటోంది.

"వీడికి జ్వరమంటగా? ఎంతుందే?"అంటూ నవారు మంచం పట్టెమీద కూర్చున్నాడు. తల్లి మనవడి పక్కన పడుకుని వుంది. లేచి, మంచంలోనే పైకి జరిగి కూచుంది. ఎదురు మంచం మీద వరమ్మ చంటిపిల్ల వున్నారు. ఆమె కూడా లేచి కూచుంది.

దుప్పటి ఎత్తి పిల్లవాడి పొట్టమీద చెయ్యేసి చూశాడు స్వామి., హెచ్చుగానే ఉంది.

"ఏడింటిదాకా ఆడుతూనే ఉన్నాడు" అని. "పార్వతి టాబ్లెట్ వేసిందిలే. ఇప్పుడు కొంత జారింది" చెప్పింది సుభద్రమ్మ.

క్షణాల తర్వాత "రేపు పొద్దుటేల పోదామనుకుంటున్నా" అన్నది వరమ్మ. ఈ మాటలంటుంటే ఆమె కంఠస్వరం వణికింది. లోపలి బాధని పెదవుల మీద బిగపట్టి, "మా యవ్వారం ఏ నాటికీ తేలేది లేదు. నా దరిద్రం నాతో పోవాల్సిందే" అన్నది. అప్పటికే ఆమె మాట గద్గదికంగా ఏడుపులోకి దిగింది.

"ఛా.... అవ్వేం మాటలే వరం!"అని ఊరుకో. మీ అన్నలకి మాత్రం నీ అవస్థలు తెలవ్వాయేం?" అనీ ఊరడింపుగా అన్నది సుభద్రమ్మ.

చప్పున లేచి నిలబడ్డాడు స్వామి. అతనికీ మాటలూ, పరిస్థితీ కాస్త కాకపోయినా, వాటిని అరాయించుకోవటం ఇబ్బందనిపించింది. "సరే... కానీ.. చూద్దాం" అంటూ బయటికి నడిచాడు.

దేనికి "సరే" నో, దేనికి "కానీ" నో దేనికి "చూద్దామో" అర్థం కాలేదు తల్లీ కూతుళ్ళకి!

వచ్చి తన గదిలో మంచం మీద పడుకున్నాడన్నమాటే గానీ స్వామికి నిద్రపట్టడం లేదు. పక్కన నేలమీద నడుంవాల్చి శూన్యంలోకి చూస్తోంది పార్వతి.

స్వామి మనసు మనసులో లేదు. ఈసారి వరమ్మతో తాను మునుపటిలా మాట్లాడలేదు. చెల్లెలు బాధపడి వుంటుందని తనకి తెలుసు. అయినా, మాట్లాడటానికేం వుంది? బావమరిది భాగోతం ఏడాదిగా జరుగుతున్నదే. అప్పులవాడిలా, శత్రువులా తమని వెంటాడుతున్నాడు. నిర్మొహమాటంగా నిలవేసి మాట్లాడుతున్నాడు. నెల్లాళ్ళ క్రితం షాపు దగ్గరకొచ్చి యాగీ చేసిపోయాడు. ఆ మర్నాడు పెళ్ళాన్ని కొట్టీ తిట్టీ పంపించాడు. ఆమె నాలుగు రోజులుండి ఏడుస్తూ తిరిగివెళ్ళింది. ఇప్పుడు మళ్ళీ వచ్చింది. అమ్మ మనసు తనకు తెలుసు. కూతురి బాధలకి విచారం, అల్లుడి మాటలకు కోపం, కొడుకుల నిర్ణయాలకి ఆలోచన.... పార్వతి ఏమీ అనదు. కానీ ఆమె మనసులోని మాటా తనకి తెలుసు.

'పాత ఆస్తులూ, లెక్కలూ లాగి ఇవ్వాళ అంతంత డబ్బు కుమ్మరించమంప, మనం నెత్తిన గుడ్డేసుకోవాలా?... ఇదీ ఆమెలో కినుక. తమ్ముళ్ళిద్దరూ అయితే, ఈ ప్రస్తావన తెస్తేనే గయ్‌మని లేస్తున్నారు. పెళ్ళి చేసుకోండిరా అంటే తాదూరకంత లేదు. మెడకో డోలా? మా చావేదో మమ్మల్నిట్టి చావనియ్ అని తమ పెళ్ళి కూడా మానుకున్నారు.

చీరె కొంగు సర్దుకుని మంచంవైపు మళ్లింది పార్వతి. స్వామి ఆలోచన తెగింది. "ఏంటాలోచన?" అడిగింది. "ఏం లేదులే" అంటూనే "ఈ సమస్య తెగేదెట్టాగా" అని నసిగాడు. క్షణం పాటు ఏవీ మాట్లాడలేదు పార్వతి. ఆ తర్వాత నిదానంగా అన్నది "ఏఁవో పిల్లలిద్దరూ ఆడపిల్లలు. మన ఖర్చు వేలల్లో, సంపాదన వందల్లో. ఎట్టా బతకాలో ఏఁవో!"

తలచుకుంటేనే రాత్రిళ్లు నిద్రలేదు" అన్నాడు స్వామి.

❖ ❖ ❖

"అయితే ఏమంటావేనువ్?" నిదానంగానే తల్లిని అడిగింది.

"నా బొంద నేననేదేం వుంది?అటు చూస్తే నీ అవస్థలు. ఇటు చూస్తే వీళ్ల బాధలూ..." అని ఊరుకుంది సుభద్రమ్మ.

చేదుమాత్ర మింగుతున్నదానిలో మొహం పెట్టింది వరమ్మ.

చాలాసేపు ఇద్దరి మధ్యా మాటలు లేవు.

ఆ తర్వాత వరమ్మే అన్నది. "ఈడనేఁవో ఇదీ వరస. ఆడ జూడబోతే పగలంతా గొడ్డు చాకిరీ. తిట్లూ, కొట్లాటా. రాత్రయిందంటే ఆ మొగుడేమో తాగొచ్చి తన్నటం, కొట్టటం, పచ్చి వొళ్లనైనా చూడకుండా పక్కలోకి లాక్కోవడం, ఆ ముసలిముండ నెకిలినవ్వులూ.... ఛీ... ఎదవ బతుకైపోయింది. ఈ మురికి బతుకు బతికే కంటే చావటం మేలు. ముక్కు మూసుకుంటే మూడు క్షణాలు..."

ఏడుపు పొంగుకొచ్చింది. ఆపైన మాట్లాడలేక ఏడ్చింది.

సుభద్రమ్మ తల్లి మనసు విలవిల్లాడింది.

చప్పున లేచి వెళ్ళి వరమ్మ మంచం మీద ఆమె పక్కగా కూచుంది. లాలనగా భుజం నిమురుతూ "పిచ్చి పిల్ల. పిచ్చి ఆలోచన్లు చెయ్యమాక. పనికి మాలినోళ్ళక్కూడా ఎప్పుడో అప్పుడు బుద్ధొస్తుందంటారు. ఆ యమ్మా క ఒడుకులకీ బుర్ర తిరక్కపోదు"అని ఇరుక్కుని పక్కగా పడుకుంది.

కూతురికి ధైర్యం చెబుతోంది గానీ, ఆమెకీ మనసులో గుబులుగానే ఉంది. వరమ్మ నడుం మీద చెయ్యివేసి తన వైపుకు తిప్పుకుంది సుభద్రమ్మ. వొళ్ళోకీ, గుండెలోకీ పొదుపుకుంది.

వరమ్మకి అమ్మ స్పర్శ వెచ్చగా వుంది. వెక్కులు పెట్టసాగింది. ఇప్పుడు తల్లిది కూడా అదే పరిస్థితి.

❖ ❖ ❖

వరమ్మ వాళ్లింటికి పోయి నెల దాటింది.

ఓ రోజు –

తెల్లవారుఝామున మూడు గంటలైంది.

ఇసుకపల్లి నుంచీ మనిషొచ్చాడు. వరమ్మ అత్తకి దగ్గర బంధువే. నడివయసు మనిషి. పేరు నారాయణ. తానెవరో చెప్పుకుని, ఆ తర్వాత అసలు విషయం బయటపెట్టాడు.

అర్ధరాత్రి వరమ్మ పురుగులమందు తాగింది! ఎవరో డాక్టర్ క్లినిక్‌లో చేర్చారు. ప్రాణాపాయం తప్పిందన్నారు. విషయం బయటకి పొక్కకుండా జాగ్రత్త పడుతున్నారు సింగన్నా, అతని తల్లి.

సుభద్రమ్మ లబోదిబోమంది. "నేననుకుంటూనే వున్నా నా తండ్రీ – వాళ్లిద్దరూ కలిసి దాని ప్రాణం తీస్తారుని" అంటూ శోకండాలు మొదలుపెట్టింది.

స్వామీ, పార్వతీ అమెని సముదాయించి ఊరుకోబెట్టారు.

వెంటనే హడావిడిగా – వచ్చిన మనిషితో ప్రయాణమైనారు. స్వామీ సుభద్రమ్మ.

అక్కడ –

ముంపు తగిలిన వూరులా వుంది వాతావరణం.

మధ్యాహ్నానికి వరమ్మకి తెలివొచ్చింది.

సాయంత్రం – సింగన్న రెచ్చిపోయాడు. పుట్టింటివారి నిర్లక్ష్యం వలనా, తన డబ్బు తనకివ్వనందువలనా వరమ్మ ఈ అఘాయిత్యానికి పాల్పడిందని ఎదురుదాడికి దిగాడు.

మాటకు మాటగా రెండుపక్షాలూ ఆ క్లినిక్ బయట చెట్టుకిందా, టీ బండ్ల ముందూ అరుచుకున్నారు.

రాత్రికి వరమ్మని తీసుకుని ఇంటికొచ్చేశారు స్వామీ, సుభద్రమ్మా. వచ్చేస్తుంటే వరమ్మ అత్త పెద్ద గొంతుతోనే హెచ్చరిక చేసింది. ఈ సారన్నా ఆ యవారం తేల్చేసి పంపండి" అని.

పదిహేను రోజులకి వరమ్మ ఆ దెబ్బ నుంచీ కోలుకుంది.

ఓరోజు స్వామి షాపు దగ్గరికొచ్చి సింగన్న, అక్కడ కూచునే పెళ్ళాం, పిల్లల్ని రప్పించుకుని, తన ఊరికి తీసుకుపోయాడు. పోతూ పోతూ "ఎవరికే భాషలో చెబితే అర్థమవుతుందో ఆ భాషలోనే చెప్పాలి" అంటూ వెళ్ళిపోయాడు.

❖ ❖ ❖

రెణ్ణెల్లు గిర్రున తిరిగాయి.

ఈ రెణ్ణెల్లల్లోనూ మళ్ళీ పుట్టింటికి రాలేదు వరమ్మ.

అసలా వైపు నుంచీ కబురే లేదు.

సుభద్రమ్మ వరమ్మా, పిల్లలూ ఎట్టా వున్నారోనే? అని కోడలితో యథాలాపంగా అన్నట్టూ, చెల్లెమ్మెట్టా వుందో కబురే లేదురా స్వామీ అని దిగులుగా కొడుకుతోనూ అంటూనే వుంది. విని ఊరుకుంటున్నారు వాళ్ళు.

సుభద్రమ్మ మధ్య మధ్యలో సంజెవేళలో కూతుర్నీ, ఆమె పిల్లల్నీ గుర్తు చేసుకుంటూ,. పెరట్లో మొక్కల్తో ఊసులాడుతోంది. ఇక్కడ మనవాళ్ళకి తన పాతకాలం నాటి ముచ్చట్లూ, తను వాళ్ళ వరమ్మత్తని ఎంత అల్లారుముద్దుగా పెంచుకున్నదీ కథలు కథలుగా చెబుతుంది. ఆ ముచ్చట్లలో ఉండ్రాళ్లతద్దెలూ, అట్ల తద్దెలూ, గొబ్బెమ్మ పండుగలూవీ, తాను కూతురికి పండక్కి కుట్టించిన పట్టు పరికిణీలూ... ఎన్నెన్నో కదిలిపోతూ వుంటాయి.

పిల్లలు నవ్వుతాలకి కొన్ని సంగతుల్ని కొసరి కొసరి అడిగినా, మొహం చాటంత చేసుకుని మరింత కొత్త కబుర్లని పోగేసుకొచ్చి బొమ్మ కట్టిస్తుంది.

ఓరోజు పార్వతి "మీ అమ్మకి కూతురి మీద బెంగగా వుందయ్యా" అన్నది స్వామితో సన్నగా నవ్వేశాడు. "సహజమే గదా" అన్నాడు. "మీ యమ్మంటే నీకూ తెలిసుండేదిలే" అన్నాడు. పార్వతికి తల్లి ఎప్పుడో అమె చిన్నప్పుడే చనిపోయింది. మొహాన్ని గూడుపెట్టుకుని లోపలికి పోయింది పార్వతి. స్వామి కూడా తర్వాత తానా మాట అనకుండా వుంటే బాగుండేదని నొచ్చుకున్నాడు.

సుభద్రమ్మ విన్నట్టుంది. గట్టిగానే అన్నది. "ఒరేయ్ స్వామీ. కోడలికాలోటుని గుర్తు చేయకురా. బాధపడుతుంది. సవత్తల్లీ ఆమె పెట్టిన అవస్థలూ గుర్తుకొస్తయ్" అని. మాటమారుస్తాడు స్వామి.

ఇవ్వాళ స్వామి షాపులో కాఫీ గింజలు మిషనాడిస్తుంటే పోస్టమన్ వచ్చాడు. సంతకం పెట్టించుకుని రిజిష్టర్ కవరిచ్చి వెళ్ళాడు. ఓ గంట తర్వాత తీరికి చిక్కితే కవరని చించి చదివాడు స్వామి.

వరమ్మ పంపిన కోర్టు నోటీసు అది! తండ్రి చనిపోయే నాటికి వున్న మొత్తం ఆస్తిలో తన వాటా కోరుతూ నోటీసిచ్చింది.

సుభద్రమ్మకీ విషయం తెలిసింది. సింగన్ననీ, అతని తల్లినీ తిట్టుకుంది. శాపనార్థాలు పెట్టింది. ఎరక్కపోయి వాళ్ళకిచ్చి పిల్ల గొంతుకోశానని తనూ తిట్టుకుంది. వరమ్మనీ తిట్టుకుంది. వరమ్మనీ "అదో వెర్రి బాగులపీనుగ. దానికే తెలిసిచచ్చు" అని కోపగించుకుంది. ఆ కోపంతో పళ్ళు కొరుక్కుంది. "బరితెగించిన మనుషులు, నన్నూ! నా కొడుకుల్నీ కోర్టు కీడుస్తారా?" అని గుప్పిట బిగించుకుంది. ఉన్నట్టుండడి – అప్పుడు అప్రయత్నంగా పెదవులు అదిరినై. ఏడుపు ముంచుకొచ్చింది. ఏడ్వసాగింది. స్వామీ, పార్వతి ఆమెను సముదాయించసాగారు.

ఆ తగ్వాత ముగ్గురూ ముక్కలు చెక్కలైన తలపుల్ని పేర్చుకుంటూ అట్టాగే కూర్చుండిపోయారు!

❖ ❖ ❖

అర్ధరాత్రి పీడకల ఒకటి భయపెట్టింది స్వామిని. వెన్ను జలగరించింది. చప్పున లేచి కూర్చున్నాడు. గది బయటకు వెళ్ళి నీళ్ళు తాగేడు. తిరిగి గదిలోకి వెళ్ళబోతూ ఉలిక్కిపడ్డాడు.

పెరటి గుమ్మం తలుపు తీసివుంది. గబగబా దక్షిణపు గదిలోకి అడుగులు వేశాడు. పిల్లలు నిద్రపోతున్నారు. తల్లి లేదు! బయటకి పరుగెత్తాడు. అందోళన నిండిన మనసుతో కలయజూశాడు.

అక్కడ సువర్ణ గన్నేరు చెట్టుకింద బండరాయి మీద సుభద్రమ్మ మోకాళ్ళ మీద మోచేతులు పెట్టుకుని, అరచేతుల్తో మొహం దాచుకుని దుఃఖిస్తోంది. దగ్గరగా వెళ్ళాడు స్వామి. 'ఏంటమ్మా! ఇక్కడ కూచున్నావేంటి?" అడిగాడు.

పార్వతీ వచ్చింది. పక్కగా నిలబడింది. "ఏమైంది?" అడిగింది. అత్తగారి మీద చేయివేసి.

ఇద్దరి పలకరింపులూ సుభద్రమ్మ దుఃఖాన్ని మరీ ఎక్కువ చేసింది. ఎగశ్వాసలో తేలిపోతున్న స్వరంతో అన్నది "ఆ పిచ్చిదాన్ని తలచుకుంటుంటేనే గుండె పగిలిపోతుందిరా స్వామీ! ఇన్నాళ్ళూ ఏడుపుల్తోనో, మొత్తుకోళ్ళతోనే వస్తూపోతూనన్నఆ వుండేదిరా. ఇక మీద ఆ చూపులక్కూడా నోచుకోదురా బిడ్డ. దాని మనసూ ఇరుకున బెట్టిన కందేనైపోయింది.

ఇక మీదట అది పూర్తిగా 'ఆడ'పిల్లేరా స్వామీ!" అంటూ బోరుమన్నది.

క్షణాల తర్వాత ఆ నిర్భాగ్యురాలిలో అన్ని చేష్టలూ ఆగిపోయినై. అక్కడి మనిషి అక్కడే నేలమీదికి జారిపోయింది.

-సకుటుంబ మాసపత్రిక